ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
గురువారం 22 ఫిబ్రవరి 2024 | 5

అంతర్వేదిలో అన్నపర్వత మహా నివేదన - 7లో



రాజోలు అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ తరపున ప్రచార రథాన్ని సిద్ధం చేసిన మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

# సీటు నాదే... ఓటు నాకే!



అభ్యర్థులను ప్రకటించక ముందే ప్రచారాస్త్రాలు

పార్టీ సిద్ధాంతాల పేరుతో ప్రజల్లోకి వెళ్తున్న నియోజకవర్గాల ఇన్‌చార్జులు

అమ్మా... అయ్యా... మన ఎమ్మెల్యే అభ్యర్థి మీ ముందుకు వచ్చారు. వచ్చే ఎన్నికల్లో మీ అమూల్యమైన ఓటేసి ఆయన్ను గెలిపించాలి... అంటూ ఇళ్ల ముందు ప్రత్యక్షమవుతున్నారు ప్రధాన రాజకీయ పార్టీల కార్యకర్తలు. సంక్షేమ పథకాలు, ఎన్నికల మేనిఫెస్టోలోని కీలక అంశాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే లక్ష్యంతో ఆయా పార్టీలకు చెందిన ఆశావహ అభ్యర్థులు పార్టీల నిర్ణయాలతో సంబంధం లేకుండా 'ముందస్తు ఎన్నికల ప్రచారం' నిర్వహిస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఇది రాజకీయ పార్టీల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అభ్యర్థులను ప్రకటించకుండానే ప్రచారాస్త్రాల పేరుతో ప్రజల ముందుకు వెళ్లడం ద్వారా ఆయా పార్టీల నాయకత్వాలను ఇరకాటంలో పెట్టేందుకు ఆశావహులు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు.

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

కోనసీమ జిల్లాలోని నాలుగైదు నియోజకవర్గాల్లో కొంత కాలంగా ప్రచారం హోరెత్తిపోతోంది. ప్రచార రథాలపై ఓటర్లను కలుస్తున్నారు. అమలాపురం అసెంబ్లీ స్థానంలో జనసేన, టీడీపీ అభ్యర్థులు పోటాపోటీగా ప్రచార యాత్రలు చేస్తున్నాయి. 'బాబు ష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారంటీ' పేరుతో టీడీపీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు రథసప్తమి నాడు ప్రచార రథాన్ని ప్రారంభించారు. అంతేగాక మోటారు సైకిళ్లపై ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ తిరగడం ద్వారా ఓటర్లను కలిసి కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. జనసేన పార్టీ ఆశావహ అభ్యర్థి శెట్టిబత్తుల రాజబాబు 'మహా సంకల్ప యాత్ర' పేరుతో అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో 200 రోజులు విస్తృత ప్రచారం చేశారు. రాజబాబే ఎమ్మెల్యే అంటూ ఆయన వర్గీయులు సంబరాలు కూడా

కొత్తపేట నియోజకవర్గంలో టీడీపీ, వైసీపీ, జనసేన అభ్యర్థులు చేరికల సభలు, ప్రచార యాత్రలతో రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తున్నారు. ఆయా పార్టీల అధిష్ఠానాలు అభ్యర్థుల పేర్లు ప్రకటించకుండానే వారు ఎన్నికల ప్రచారాస్త్రాలు సంధిస్తున్నారు. టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన నుంచి ఆయన సోదరుడు బండారు శ్రీనివాసరావు, వైసీపీ తరపున ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తమదైన శైలిలో రోజుకో గ్రామంలో పార్టీల్లో పలువురిని చేర్చుకుంటూ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఆసరా సభల్లో వైసీపీ, భవిష్యత్తుకు గ్యారంటీ పేరిట టీడీపీ, కార్యకర్తలు చేరికలతో జనసేన.... ఇలా మూడు పార్టీలకు చెందిన వారూ ఎమ్మెల్యే అభ్యర్థులుగా ప్రచారం చేసుకోవడం గమనార్హం.

పి.గన్నవరం నియోజకవర్గంలో జనసేన ఇన్‌చార్జి గిడ్డి సత్యనారాయణ, వైసీపీ ఇన్‌చార్జి, జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, రాజోలు నియోజకవర్గంలో టీడీపీ తరపున మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, వైసీపీ తరపున ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఎన్నికల ప్రచారాలను ప్రారంభించారు. ఇక్కడ జనసేనకు టిక్కెట్టు కేటాయించినప్పటికీ అభ్యర్థి ప్రజల్లోకి రాకపోవడంతో ప్రస్తుతం టీడీపీకి చెందిన గొల్లపల్లి సూర్యారావు 'జయహో బీసీ', 'భవిష్యత్తుకు గ్యారంటీ' అంటూ ప్రచార రథాన్ని ముందుంచి ఎన్నికల యాత్రను కొనసాగిస్తున్నారు.

ముమ్మిడివరంలో టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, మండపేటలో వైసీపీ నుంచి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, టీడీపీ నుంచి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, రామచంద్రపురంలో టీడీపీ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం, వైసీపీ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాశరావు ప్రజల్లోకి వెళుతున్నారు. అయితే వీరంతా ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, ఆశావహ అభ్యర్థులు మాత్రమే.

కాగా మండపేటలో టీడీపీ అభ్యర్థిగా వేగుళ్ల జోగేశ్వరరావును ఆ పార్టీ అధిష్ఠానం ఇప్పటికే ప్రకటించింది. రాజోలులో జనసేన నుంచి పోటీ చేస్తారని ప్రకటించినప్పటికీ అభ్యర్థి ఇంకా వెలుగులోకి రాలేదు.



అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ తరపున ప్రచార రథాన్ని సిద్ధం చేసిన మాజీ ఎమ్మెల్యే ఆనందరావు



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

## ఎన్నికల సంఘం ఆదేశాల మేరకే అధికారుల నియామకం

అమలాపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం ఆదేశాల మేరకే అధికారులకు నియామక ఉత్తర్వులు జారీ చేస్తున్నామని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. పోలింగ్ విధులకు ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను సేకరించి కంప్యూటరీకరణ చేస్తున్నామన్నారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణలోని పురోగతిని వివరించారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు జిల్లా స్థాయి అధికారుల బదిలీలు పూర్తి చేశామ న్నారు. బదిలీపై వచ్చిన అధికారులు ఎన్నికల విధులకు హాజరయ్యారన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏవిధమైన సమాచారం అవసరం ఉన్నా కలెక్టర్ కార్యాలయంలో సంప్రదించి పొందాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, రాజకీయ పార్టీలనాయకులు దూరి రాజేష్, వడ్డి నాగేశ్వరరావు, అల్లాడి స్వామినాయుడు, ఎస్వీ చంద్రశేఖర్, కాశి లక్ష్మీభవానీ, కారెం వెంకటేశ్వరరావు, పి.పవన్‌సూర్య, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.




పరుపులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

## సంక్షేమ వసతిగృహ విద్యార్థులకు 1,020 పరుపులు పంపిణీ

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 21: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద జిల్లాలోని ఎస్సీ, బీసీ సంక్షేమ వసతిగృహాల్లో విద్యనభ్యసిస్తున్న 7వేల మంది విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సీఎస్ఆర్ నిధులు రూ.10లక్షల అంచనా వ్యయంతో 1,020 పరుపులను సమకూర్చింది. బుధవారం వాటిని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో విద్యార్థులకు కలెక్టర్ అందజేశారు. ఇంకా 600 మందికి పరుపులు సమకూర్చాల్సాలని సీఎస్ఆర్ ప్రతినిధి పి.సుబ్రహ్మణ్యానికి కలెక్టర్ సూచించారు. సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహాలకు 514, వెనుకబడిన తరగతుల వసతిగృహాలకు 506 పరుపులను అందించారు. సీఎస్ఆర్ హెడ్ పి.సుబ్రహ్మణ్యం, సీపీవో వెంకటేశ్వర్లు, బీసీ వెల్ఫేర్ అధికారి వై.సాంబమూర్తి, వసతిగృహ సంక్షేమ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయం వద్ద బోరున విలపిస్తున్న మహిళా వలంటీరు

# మహిళా వలంటీరుకు అవమానం

» రేణుక వడయార్‌పై ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ప్రశాంత్ ఆగ్రహం

» అంబాజీపేటలో వలంటీర్లకు అభినందన సభలో ఘటన

అంబాజీపేట, ఫిబ్రవరి 21: వలంటీర్ల అభినందన సభలో మహిళా వలంటీరుకు అవమానం జరిగింది. వైసీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆమె బోరున విలపించింది. వివరాలు ఇలా వున్నాయి... అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం వలంటీర్ల అభినందన సభ జరిగింది. జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులను ప్రజాప్రతినిధులు అందజేసి సత్కరించారు. తొలుత మాచవరం పరిధిలోని సచివాలయం-3 వలంటీర్లను వేదికపైకి పిలిచారు. అయితే సత్కరించకుండానే పంపించేశారు. కాసేపటి తర్వాత మరలా పిలిచారు. ఈ క్రమంలో వేదికపైకి వెళ్తుండగా అక్కడే వున్న మహిళా వలంటీరు ర్యాలి రేణుక వడయార్‌పై మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ముందెళ్లాలి. మీ ఊరు దగ్గరే కదా... అవార్డు తీసుకోవడానికి అంత తొందరెందుకు అనడంతో ఆమె బోరున విలపించింది. విషయం తెలుసుకున్న రేణుక తండ్రి, వైసీపీ నాయకుడు శ్రీనివాస్ వడయార్ అక్కడికి చేరుకుని ఎంపీటీసీ సమాఖ్య ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో కొద్దిసేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. అక్కడ ఉన్న నాయకులు వలంటీరుతో పాటు ఆమె తండ్రికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ వడయార్, ఎంపీటీసీ ప్రశాంత్ మధ్య మాటల యుద్ధం ఆగలేదు. తనపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎంపీటీసీ బహిరంగ క్షమాపణ చెప్పాలని రేణుక పట్టుబట్టింది. దీంతో ప్రశాంత్ అక్కడి నుంచి జారుకున్నట్టు సమాచారం. కార్యక్రమం నుంచి జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే వెళ్లిన అనంతరం ఈ ఘటన జరిగింది. అనంతరం మండలంలోని పలువురు వలంటీర్లను సత్కరించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, ఈవోపీఆర్డీ బి.మమత, నాయకులు పేరి శ్రీను, విత్తనాల శేఖర్, కొర్లపాటి కోటబాబు, నాగవరపు నాగరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



ఆలమూరు మండలం పినపళ్లలో కోళ్ల ఫారాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ వెంకటరమణ

## బర్డ్‌ఫ్లూ వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకుంటున్నాం

పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటరమణ

మండపేట, ఫిబ్రవరి 21: కోళ్ల రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న బర్డ్‌ఫ్లూ వ్యాధి జిల్లాలోని కోళ్లకు వ్యాపించకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పశుసంవర్ధక శాఖ జిల్లా సంయుక్త సంచాలకుడు డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. కోనసీమ జిల్లాలో 22, తూర్పు గోదావరి జిల్లాలో 38, కాకినాడ జిల్లాలో 38 ర్యాపిడ్ ఫోర్స్ టీమ్‌లను సిద్ధం చేసినట్టు ఆయన చెప్పారు. కాగా ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు ఎక్కడా బర్డ్‌ఫ్లూ లక్షణాలు కనిపించ లేదని పశుసంవర్ధక శాఖ అధికారులు చెప్తున్నారు. వదంతులను నమ్మవద్దని... చికెన్, గుడ్లు తినేందుకు సందేహించవద్దని పశువైద్యులు సూచిస్తున్నారు. చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ లక్షణాలు కనిపించిన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో వ్యాధి ప్రబలకుండా అవస రమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. కోళ్ల పెంపకం రైతులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు.



## నేడు వసంత మండపం ప్రారంభోత్సవం

అంతర్వేది, ఫిబ్రవరి 21: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మాఘ పౌర్ణమి సందర్భంగా చక్రవారీ స్నానం నిర్వహించనున్నారు. తొలుత స్వామివారిని ఆలయం వద్ద నుంచి ప్రత్యేక వాహనంపై సముద్ర ఒడ్డుకు తీసుకువెళ్లి పూజలు చేస్తారు. జల్లు స్నానం ముగిసిన అనంతరం సముద్రపు ఒడ్డు నుంచి వసంత మండపానికి (తలార్పు) చేరుకుంటారు. ఈ నేపథ్యంలో నూతనంగా నిర్మించిన వసంత మండపాన్ని గురువారం ఉదయం 11.54 గంటలకు ప్రారంభిస్తామని ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ తెలిపారు. అమలాపురం పూర్వపు ఆర్డీవో వసంతరాయుడు మంజూరు చేసిన రూ.9లక్షలు, దేవదాయ శాఖ నిధులు రూ.9లక్షలు కలిసి ఈ మండపాన్ని నిర్మించినట్టు ఆయన చెప్పారు.




చంద్రబాబుకే ఓటెందుకు వేయాలి పోస్టరును ఆవిష్కరిస్తున్న టీడీపీ అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జి హరీష్‌మాధుర్

# తొలి ఓటు చంద్రబాబుకే వేయాలి

యువతకు టీడీపీ అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జి హరీష్‌మాధుర్ పిలుపు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 21: ఓటు హక్కు పొందిన యువత వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తును, తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తొలి ఓటును చంద్రబాబుకే వేయాలని టీడీపీ అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్ పిలుపునిచ్చారు. అమలాపురంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం 'మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' కార్యక్రమాన్ని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కా సునీల్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హరీష్ మాట్లాడుతూ యువత తొలిసారిగా వేసే ఓటు దేశ, రాష్ట్ర గతిని మార్చేదిగా ఉండాలన్నారు. ఎన్నో ఐటీ కంపెనీలను ప్రారంభించి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చంద్రబాబు కృషి చేస్తే వైసీపీ ప్రభుత్వం ఆ కంపెనీలను రాష్ట్రం నుంచి తరిమేసిందని విమర్శించారు. రాష్ట్రంలో సైకోతో జరుగుతున్న పోరాటాన్ని గుర్తించి అందరూ బాధ్యతాయుతంగా పోరాడుతూ ఓట్లు వేయాలని కోరారు. 'చంద్రబాబుకే ఎందుకు ఓటు వేయాలి' పేరిట ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ వారియర్స్ నిమ్మకాయల శేషునాయుడు, కట్టా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కోనసీమ తిరుమల వాడపల్లిలో విమాన వేంకటేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠ - 7లో



విగ్రహాన్ని ప్రతిష్ఠకు తీసుకెళ్తున్న దాత సిద్ధార్థరెడ్డి, ఈవో రమేష్‌రాజు

## కాంగ్రెస్ నేతలకు నోటీసులు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 21: కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 'చలో' సెక్రటేరియట్‌కు బయల్దేరిన కాంగ్రెస్ నాయకులకు బుధవారం రాత్రి అమలాపురం తాలూకా పోలీసులు నోటీసులు ఇచ్చి గృహ నిర్బంధం చేశారు. ఆ పార్టీ బీసీ విభాగం కోనసీమ జిల్లా అధ్యక్షుడు కుడుపూడి శ్రీనివాసరావు, కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు రాయుడు వెంకటరమణలకు నోటీసులు అందజేశారు.



శ్రీనివాసరావుకు నోటీసు ఇస్తున్న పోలీసు

# అన్నపర్వత మహా నివేదన



అన్నపర్వత మహా నివేదన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

అంతర్వేది, ఫిబ్రవరి 21: అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భా గంగా స్వామివారికి బుధవారం రాత్రి 7 గంటలకు అన్నపర్వత మహా నివేదన జరిపారు. పశ్చిమగోదావరి జిల్లా పొలమూరుకు చెందిన కలిదిండి వంశీయులు క్వింటాల్ బియ్యంతో అన్నం వండించారు. సాయంత్రం స్వామివారి మూల విరాట్ ఎదుట ఉన్న గంట మండపంలో అన్నాన్ని రాశిగా పోశారు. రెండు రకాల కూరలు, పప్పు, పులుసు, పెరుగు, నెయ్యి, బూరెలతో స్వామివారికి మహా నివేదన జరిపారు. ప్రధాన అర్చకులు, స్థానాచార్యులు వింజమూరి రామరంగాచార్యులు, పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, వేద పండితులు చింతా వెంకటశాస్త్రి, అర్చక స్వాములు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కలిదిండి కుమారరామగోపాల రాజాబహదూర్, పొలమూరు వంశీయులు, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, వనమాలి మూలాస్వామి, వలవల రాంబాబు, పోతురాజు శ్రీవెంకటకృష్ణ, పొలమూరి సత్రం నిర్వాహకులు, అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

# ఘనంగా గ్రామోత్సవాలు



గజవాహనంపై స్వామివారి గ్రామోత్సవం

అంతర్వేది, ఫిబ్రవరి 21: అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలో భక్తులు బారులు తీరారు. తొలుత పొలమూరి వారి వార్షిక అభిషేకం నిర్వహించారు. ఈ అభిషేకంలో పొలమూరి కుటుంబసభ్యులు, భక్తులు విశేష పూజలు చేశారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు లక్కవరం వాస్తవ్యులు మంగిన నాగేశ్వరరావు వారిచే నిర్మితమైన గజ వాహనంపై స్వామివారిని ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి వెంట నారసింహ, గోవిందనామస్మరణలు చేశారు. శృంగవరప్పాడు వాస్తవ్యులు రావి వెంకటసత్యనారాయణ, శ్రీహరిరావు వారిచే పొన్నవాహనంపై స్వామివారి గ్రామోత్సవం రాత్రి 8 గంటలకు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి హారతులు పట్టారు.

# వాడపల్లిలో విమాన వేంకటేశ్వరుని ప్రతిష్ఠ



ప్రతిష్ఠ నిర్వహిస్తున్న దృశ్యం



ఆత్రేయపురం, ఫిబ్రవరి 21: కోనసీమ తిరుమల వాడపల్లిలో తిరుమల తరహాలో విమాన వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. రెండో రోజైన బుధవారం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాదచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, ప్రధాన హోమాలను జరిపారు. మేళతాళ మంగళవాయిద్యాలు, వేద మంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ ఉదయం 10.31 గంటలకు విమాన వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ఊబలంకకు చెందిన మేడపాటి శ్రీనివాసరెడ్డి(ఎంఎస్ఆర్) కుమారుడు సిద్ధార్థ రెడ్డి-అన్విత రెడ్డి దంపతులు ప్రతిష్ఠించారు. అనంతరం మహా పూర్ణాహుతి నిర్వహించారు. ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్, అయినవిల్లి దేవస్థానం ఈవో ముదునూరి సత్యనారాయణరాజు, వాడపల్లి ధర్మకర్తల మండలి సభ్యులు మన్యం సూర్యకుమారిభాను, వి.సురేష్‌రాజు, ప్రముఖులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జనసేనలోకి మల్లాడి రాజేంద్రప్రసాద్

**సాదరంగా పార్టీలోకి ఆహ్వానించిన పవన్‌కల్యాణ్**



రాజేంద్రప్రసాద్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న పవన్

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 21: కాకినాడ నగరానికి చెందిన మల్లాడి రామారావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మత్స్యకార నాయకుడు మల్లాడి రాజేంద్రప్రసాద్ బుధవారం జనసేన పార్టీలో చేరారు. భీమవరంలో పార్టీ నాయకుల సమావేశం జరుగుతున్న ప్రాంగణానికి కాకినాడ జగన్నాథపురంలోని తన నివాసం నుంచి 100 కార్లలో ర్యాలీగా వెళ్లారు. అక్కడ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరారు. రాజేంద్రప్రసాద్‌కు పవన్‌కల్యాణ్ పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. జనసేనను క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తూ రానున్న ఎన్నికల్లో బలంగా పనిచేయాలని పవన్‌కల్యాణ్ సూచించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ కాకినాడ నుంచి భీమవరానికి తనతోపాటు ర్యాలీగా వచ్చిన జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలకు కృతజ్ఞతలు తెలిపారు. కాకినాడ నగరంలో విస్తృతంగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించి పార్టీని, జనసేనాని ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు. కాకినాడ నగరంలో భూకబ్జాలు, అరాచకాలు బాగా పెరిగిపోయాయన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అక్రమాల నుంచి కాకినాడను కాపాడుకోవాలన్నారు. వైసీపీ అరాచక పాలన అంతం జనసేన ద్వారానే సాధ్యమన్నారు. మత్స్యకారులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన ద్వారంపూడిని ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళ మెడలో చైన్ లాక్కుని పరారీ



సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యం

అనపర్తి, ఫిబ్రవరి 21 : అనపర్తిలో బుధవారం తెల్లవారుజామున ఓ మహిళ మెడ నుంచి 28 గ్రాముల బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగుడు లాక్కొని పరారయ్యాడు. ఈ పెనుగులాటలో మహిళకు గాయాలయ్యాయి. ఆమెను ఆస్పత్రికి తరలించారు. అనపర్తిలోని మార్కండేయపురంలో వరలక్ష్మి అపార్ట్‌మెంట్ ఎదురుగా నివాసం ఉంటున్న తేతల పుష్పావతి తెల్లవారుజామున లేచి వాకిలి శుభ్రం చేస్తుండగా దారిన వెళుతున్న వ్యక్తి ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కుని పరారయ్యాడు. వ్యక్తిని పట్టుకునే ప్రయత్నం చేసిన పుష్పావతి అదుపుతప్పి మెట్లపై నుంచి కిందకు పడిపోవడంతో గాయాలపాలైంది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని గొలుసు విలువ సుమారు రూ.80 వేల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నామని సీసీ ఫుటేజ్ ద్వారా నిందితుడిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామని ఎస్ఐ రామారావు తెలిపారు.

# సందిగ్ధంలో జ్యోతిర్మయి సత్యదేవ వ్రతం

**రూ.10,116 టిక్కెట్టు ధరతో నిర్వహించాలని కమిషనర్ ఉత్తర్వులు**

**ఏడుగంటలు చేయాల్సిన జ్యోతిర్మయి వ్రతాన్ని మూడున్నర గంటల్లో ఎలా చేపడతారని భక్తుల ప్రశ్న**

**నిలకడలేని వైదిక కమిటీ నిర్ణయం**



అన్నవరం, ఫిబ్రవరి 21: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో నూతనంగా ప్రవేశపెట్టనున్న జ్యోతిర్మయి సత్యదేవ వ్రతం నిర్వహణ ప్రస్తుతం సందిగ్ధంలో పడింది. ఇప్పటికే దేవస్థానంలో రూ 300, 1000, 1500, 2000 ధరలతో వ్రతాలు జరుగుతుండగా ఇవన్నీ దేవస్థానం వ్రతపురోహితులు వ్రతభక్తులతో మంత్రపూర్వకంగా తమలపాకులపై అక్షింతలు, వక్కలతో అష్టదిగ్పాలకులు, పంచభూతాలు, నవగ్రహాలతో ఆవాహన చేయిస్తారు. అయితే ఈవో ఆజాద్ పనిచేసిన కాలంలో అప్పటి వైదికకమిటీ నిర్ణయంతో జ్యోతిర్మయి సత్యదేవ వ్రతం చేపట్టవచ్చునని సూచించారు. ఈవ్రతంలో ప్రత్యేకత ఏమిటంటే జ్యోతులతో ఆవాహన చేయించాలి. దీనిపై ఆజాద్ దేవదాయ కమిషనర్ అనుమతి కోసం దస్త్రాన్ని పంపగా రూ.10,116ల వ్రతం టిక్కెట్ ధర నిర్ణయించి వ్రత సామగ్రికి రూ.4500, మిగిలిన మొత్తంలో 40 శాతం కమిషన్‌ను వ్రతపురోహితులకు చెల్లించాలని కమిషనర్ ఉత్తర్వులలో పేర్కొన్నారు. దీనికి సంబంధించి పాత అకౌంట్ విభాగ కార్యాలయాన్ని జ్యోతిర్మయి వ్రత మండపంగా నిర్ణయించి తుది మెరుగులు దిద్దారు. ప్రత్యేక ఏసీ మండపం, ఇంద్రలోకం తలపించేలా దేవతామూర్తుల పెయింటింగ్ తదితర పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈలోగా ఆజాద్ అన్నవరం దేవస్థానం నుంచి బదిలీపై వెళ్లడంతో ఎక్కడ పనులు అక్కడ నిలిచిపోయాయి. ఆయన స్థానంలో వచ్చిన రామచంద్రమోహన్‌ను కొందరు పండితులు, శాస్త్రం తెలిసిన భక్తులు కలిసి ఈ వ్రతం శాస్త్రోక్తంగా జరగాలంటే సుమారు 7 గంటల సమయం పడుతుందని ఇంటివద్ద ఆచరించుకొనే వారికి మాత్రమే సాధ్యమవుతుందని ఏడుగంటల పాటు చేపట్టాల్సిన వ్రతాన్ని మూడున్నర గంటలకు కుదించడం ఏమిటని అన్నారు. దీని వలన భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని పేర్కొనడంతో ఈవో రామచంద్రమోహన్ ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకుని వైదిక కమిటీని ప్రశ్నించగా తాము సమయం అధికమవుతుందని చెప్పగా కుదించి చేయడానికి అవకాశం ఉంటుందా అని అడగడంతో విధిలేని పరిస్థితుల్లో మూడున్నర గంటల సమయంలో పూర్తిచేయవచ్చునని తెలిపినట్లు చెప్పినట్లు తెలిసింది. అయితే ఈవో రామచంద్రమోహన్ భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ఈ వ్రత నిర్వహణను తాత్కాలికంగా వాయిదా వేసి దీనిపై చైర్మన్, పాలక మండలిసభ్యులతో చర్చించి దేవదాయ కమిషనర్‌కు నివేదిక పంపి తదుపరి చర్యలు తీసుకోవాలని ఆలోచన చేస్తున్నారు. ఏదిఏమైనా అన్నవరం దేవస్థానంలో వైదికపరమైన నిర్ణయాలు తీసుకునే సమయంలో వైదిక కమిటీ అధికారుల మెప్పుకోసం కాకుండా ఆలయ ఆచార సంప్రదాయాలు, భక్తుల మనోభావాలు దృష్టిలో ఉంచుకుని వ్యవహరించాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

## రిటైర్డ్ అధికారులు ఎన్నికల్లో పోటీ చేసే విషయంలో

# ఆంక్షలు విధించాలి

**అందుకోసం సుప్రీంకోర్టులో పిల్ వేస్తా**

**ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళతాం**

**పాత్రికేయులపై దాడి ఘటనలను హైకోర్టు సుమోటోగా తీసుకోవాలి**

**అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్**



రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 21: రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు, రిటైర్డ్ న్యాయమూర్తులు ఎన్నికల్లో పోటీచేసే విషయంలో ఆంక్షలు విధించాలని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. తూరుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ కళాశాల కాన్ఫరెన్స్ హాలులో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాల్లో పనిచేసిన ఉన్నతస్థాయి అధికారులు ఆయా ప్రభుత్వాలకు బాగా అనుకూలంగా పనిచేసి అటుపై ఉద్యోగ విరమణ తర్వాత ఎన్నికల్లో పోటీ చేసేందుకు ముందుకు వచ్చేస్తున్నారని అటువంటి వారికే రాజకీయ పార్టీలు కూడా సీట్లు ప్రాధాన్యం ఇచ్చి అప్పటివరకు ఎన్నోఏళ్లుగా పార్టీ విధేయులుగా పనిచేసిన నాయకులను పక్కనపెట్టి సీట్లు కేటాయించడం వల్ల చాలామందికి అన్యాయం జరుగుతోందన్నారు. ఈ విషయంలో తాను అభ్యంతరం వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేస్తానన్నారు. రిటైర్డ్ అయిన అధికారి ఐదేళ్ల వరకు ఎన్నికల్లో పోటీచేసే అర్హత లేకుండా చట్టం తీసుకోవాలని కోరతామన్నారు. అదే విధంగా న్యాయ వ్యవస్థలో న్యాయమూర్తులుగా ఉన్నవారు కొంతమంది చాలా కేసుల్లో ప్రభుత్వాలకు అనుకూలంగా తీర్పులు ఇస్తున్నారని అవి ప్రజావ్యతిరేకమైనవన్నారు. ఇలా ప్రభుత్వాలకు సహకరిస్తే వారు పదవీ విరమణ పొందాక రాష్ట్ర గవర్నర్‌లుగా నియమించే పరిస్థితులు ప్రస్తుతం ఉన్నాయన్నారు. ప్రభుత్వంలో ఉన్నత స్థాయిలో పనిచేసి పదవీ విరమణ చేసిన అధికారులు వెంటనే ఎన్నికల్లో పోటీ చేయకుండా చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళతామన్నారు. వ్యవస్థలో నాలులో స్తంభంగా ఉన్న మీడియా రంగంపై ఈ ప్రభుత్వం దాడులకు దిగడం హేయమైన చర్య అన్నారు. కాంగ్రెస్ పార్టీలో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన రాంగోపాల్ రెడ్డి లాంటి నాయకులు కూడా వైసీపీలోకి వెళ్లాక దారుణంగా మారడం దురదృష్టకరమన్నారు. పాత్రికేయులు, ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని హైకోర్టు ఈ సంఘటనలను సుమోటోగా స్వీకరించాలని కోరారు. ఇక కాంగ్రెస్ పార్టీలో జరిగే పరిణామాలపై ఆయన స్పందించారు. పీసీసీ అధ్యక్షురాలిగా షర్మిలారెడ్డి నియమితులవడం, జగన్ మనిషి ఆళ్ల రామకృష్ణారెడ్డి లాంటి వాళ్లు వెళ్లినట్లు వెళ్లి తిరిగి వెనక్కి రావడం వెనుక జగన్ ప్లాన్ ఉందన్నారు. అంతా జగన్‌ప్లాన్ ప్రకారం జరుగుతుందని బహుశా షర్మిళారెడ్డిని కాంగ్రెస్‌లోకి జగనే పంపించి ఉంటాడనే అనుమానం వ్యక్తం చేశారు. షర్మిలారెడ్డి మాత్రం అన్న జగన్‌ను టార్గెట్ చేశారని దీనివెనుక ప్రయోజనం ఎవరికి అనేది త్వరలో తేలుతుందన్నారు. తాను ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించాక పోటీ గురించి చెబుతానని అమలాపురం నుంచే పోటీ ఉంటుందన్నారు. ఇటీవల తాను నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో అమలాపురం ప్రాంత ప్రజలు 79 శాతం మంది తనకు అనుకూలంగా ఉన్నట్లు ఫలితం వచ్చిందన్నారు. ఇక రాజకీయ పార్టీల పొత్తు విషయంలో ఇంకా ఎలాంటి స్పష్టత కానరావడం లేదన్నారు.

# 28న మెగా జాబ్‌మేళా

**ఐదు జిల్లాల పరిధిలో యువతకు అవకాశాలు**

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 21: జోన్-2 పరిధిలో ఐదు జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఈనెల 28న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి తెలిపారు. ఉదయం 10 గంటలకు వీఎల్ పురం మార్గాని ఎస్టేట్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో బుధవారం తూర్పుగోదావరి, కోనసీమ, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో నోడల్ అధికారులతో జాబ్ మేళాపై సమన్వయ శాఖల అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ సుమారు 100 కంపెనీల భాగస్వామ్యంతో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన కోసం మెగా జాబ్ మేళా నిర్వహించడం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ జాబ్ మేళాలో 6 వేలకు పైబడి ఉద్యోగాలు కల్పిస్తారని చెప్పారు. మండలానికి కనీసం వంద మంది నిరుద్యోగులు ఈ జాబ్ మేళాకు హాజరయ్యేలా వాట్సాప్, ఎస్ఎంఎస్‌లు, ఇంటింటా ప్రచారం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సహాయ సీఈవో ఎస్.రామ్‌గోపాల్, జిల్లా ఉపాధి కల్పనా అధికారి కె.హరిశ్చంద్రప్రసాద్, జిల్లా పరిశ్రమల అధికారి బి.వెంకటేశ్వరరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు, డివిజనల్ డీఆర్‌వో ఎంఎల్ ఆచార్యులు, ఐదు జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సీఎంఏ పరీక్ష ఫలితాల్లో జాతీయస్థాయిలో 11వ ర్యాంక్



శ్రీహర్షిణి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 21: ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా డిసెంబరు 2023లో నిర్వహించిన జాతీయ స్థాయి సీఎంఏ ఫైనల్ పరీక్షల్లో రాజమహేంద్రవరానికి చెందిన విద్యార్థిని కొత్తగుండు శ్రీహర్షిణి 11వ ర్యాంక్ సాధించింది. అదే విధంగా జాతీయ స్థాయిలో ఇంటర్ పరీక్షల్లో కూడా 37వ ర్యాంక్ సాధించింది. ఉభయగోదావరి జిల్లాలలో చాలా మంది విద్యార్థులు సీఎంఏ ఇంటర్, సీఎంఏ ఫైనల్స్ ఉత్తీర్ణత సాధించారు. ఈ ర్యాంక్ తో పాటు జాతీయ స్థాయిలో సీఎంఏ ఫైనల్స్‌లో ఎం.జగదీష్ 47వ ర్యాంక్, పి. సురేష్ 50వ ర్యాంక్, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో సాయి మేఖన 48వ ర్యాంక్ సాధించారని చాప్టర్ మేనేజ్‌మెంట్ టీం పి.నారాయణరావు, శ్రీధర్, బొజ్జ నారాయణ తెలిపారు. శ్రీహర్షిణి తండ్రి కొత్తగుండు శ్రీధర్ వేమగిరిలో శ్రీసర్వరాయ షుగర్స్ కోకోకాల కంపెనీలో చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు.

# లొంగిపోయిన మావోయిస్టు

చింతూరు, ఫిబ్రవరి 21: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీసుల ఎదుట మావోయిస్టు పార్టీ దళ సభ్యుడితో పాటు మిలిషియా సభ్యుడు లొంగిపోయారు. చింతూరు ఏఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి బుధవారం విలేకర్లకు వివరాలు అందించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, సుక్మా జిల్లా, గచ్చనపల్లికి చెందిన పద్దం అడమయ్య 2014లో మావోయిస్టు విధానాలకు ఆకర్షితుడయ్యాడు. ప్రస్తుతం అడమయ్య గొల్లపల్లి ఎల్‌ఓఎస్ (లోకల్ ఆర్గనైజేషన్ స్క్వాడ్) సభ్యుడిగా క్రిష్టారం పరిధిలో పార్టీ కార్యక్రమాలు చేపడుతున్నాడు. ఇదే ప్రాంతానికి చెందిన కణతి లచ్చ 2019 నుంచి 2021 వరకు మిలిషియా సభ్యుడిగా వ్యవహరించాడు. వివిధ కారణాలతో వీరిద్దరూ లొంగిపోవడంతో వారిని అరెస్టు చేసినట్లు ఏఎస్పీ తెలిపారు. పోలీసు శాఖ చేపడుతున్న పరివర్తన, ఆత్మీయ సమ్మేళనం, స్ఫూర్తి తదితర కార్యక్రమాలతో పలువురు జనజీవన స్రవంతిలోకి వచ్చేందుకు ఆసక్తి కనబరుస్తున్నారని ఏఎస్పీ చెప్పారు. లొంగి పోయిన ప్రతి మావోయిస్టుకు ప్రభుత్వం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ 42 బెటాలియన్ ఇన్‌ఛార్జి మోతీలాల్, సీఐ గజేంద్ర కుమార్, ఎస్ఐ శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

**అడమయ్య నేరాల జాబితా**

2016లో ఛత్తీసగఢ్‌లోని పొట్టకపల్లిలో మావోయిస్టులు చేపట్టిన దాడిలో ముగ్గురు సీఆర్‌పీఎఫ్ కమాండోల మత్య, 2017 లో కొత్తపల్లిలో చేపట్టిన అంబుష్ ద్వారా 12 మంది సీఆర్‌పీఎఫ్ కమాండోలు, అదే ఏడాది జె.గురుగొండ పోలీసు స్టేషను పరిధిలోని రాయిగూడ వద్ద జరిగిన ఎదురుకాల్పుల్లో 7 గురు సీఆర్‌పీఎఫ్ కమాండోలు, 2018లో క్రిష్టారం సమీపంలో 12 కమాండోల దారుణహత్యల ఘటనలలో అడమయ్య పాల్గొన్నాడు.

# 95 డిటోనేటర్స్ స్వాధీనం

**మావోయిస్టులకు పేలుడు సామగ్రి అందిస్తున్న ఇద్దరి అరెస్టు**



స్వాధీనం చేసుకున్న పేలుడు సామగ్రి

చింతూరు, ఫిబ్రవరి 21: మావోయిస్టులకు పేలుడు సామగ్రి తరలిస్తున్న ఇద్దరు నిందితులను అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. చింతూరు ఏఎస్పీ మహేశ్వరరెడ్డి అందించిన వివరాలు ప్రకారం.. ఒడిసా రాష్ట్రం, మల్కాన్‌గిరి జిల్లా అనంతపల్లికి చెందిన నక్కా దావీదు, అలియాస్ డేవిడ్ రాజు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా పట్నంపారాకు చెందిన బిమాల్ విశ్వాస్ తెలంగాణ రాష్ట్రం నుంచి వయా చింతూరు మండలం మీదుగా పేలుడు సామగ్రిని తరలించే యత్నం చేశారు. 30వ నెంబరు జాతీయ రహదారిపై పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వారు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిద్దరిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఆ సమయంలో వారి వద్ద పేలుడు సామగ్రి లభ్యమైందని ఏఎస్పీ చెప్పారు. పేలుడు సామగ్రిని మావోయిస్టులకు చేరవేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడైందన్నారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. నిందితుల నుంచి 95 డిటోనేటర్స్ 15 మీటర్ల ఫ్యూజ్ వైర్, 190 జెలిటిన్ స్టిక్స్ మావోయిస్టులు రాసి ఇచ్చిన పేలుడు సామగ్రి లిస్టు, రూ. 13 వేల నగదు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ గజేంద్ర కుమార్, ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# 250 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు

గండేపల్లి, ఫిబ్రవరి 21: కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలో మురారి గ్రామ శివారులో పోలవరం గట్టు వద్ద నుంచి గంజాయి తరలిస్తున్నారనే సమాచారం మేరకు పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి ఆదేశాల మేరకు జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు ఆధ్వర్యంలో గండేపల్లి ఎస్ఐ ఎస్ రామకృష్ణ సిబ్బందితో కలిసి దాడి చేసి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఒడిసాకు చెందిన దామాకార అతని ముగ్గురు స్నేహితులు విశాఖ ఏజెన్సీలోని ధారకొండ నుంచి మహారాష్ట్రకు సుమారు 250 కిలోల గంజాయిని 12 ప్లాస్టిక్ బస్తాల్లో తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. దామాకారను, రెండు మోటార్ బైక్‌లను అదుపులోకి తీసుకోగా మరో ముగ్గురు పరారీలో ఉన్నారన్నారు. త్వరలో వారిని కూడా పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు. దామాకారను అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్ నిమిత్తం పెద్దాపురం తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## 25 కిలోల గంజాయి పట్టివేత

మోతుగూడెం, ఫిబ్రవరి 21: చింతూరు మండలం మోతుగూడెం పోలీస్‌స్టేషన్ ఎదుట మోతుగూడెం ఎస్ఐ జి. గోపాలరావు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా నలుగురు వ్యక్తులు కారులో 25 కిలోల గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. గంజాయిని ఒడిసాలోని చిత్రకొండ నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్నారన్నారు. ప్రకాష్ రఘునాథచౌదరి, రాజు అభిమాను, మనోజ్ చౌదరి, కల్పేస్ భావిస్కర్‌లపై కేసులు నమోదు చేసి, వారి వద్ద నుంచి కారు, సెల్‌ఫోన్‌లు, 25 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి విలువ రూ.1.25 లక్షలు ఉంటుందన్నారు. ఈ తనిఖీల్లో ఏఎస్ఐ రాజేశ్వరరావు, సూర్యనారాయణరాజు, హెడ్ కానిస్టేబుల్ రాజు, రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మార్చి 14న పొగాకు కొనుగోళ్లు



సమావేశానికి హాజరైన గోపాలపురం రైతులు

గోపాలపురం, ఫిబ్రవరి 21: అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా పొగాకు పంట పండించాలని పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్ గుంటూరులో జరిగిన పొగాకు బోర్డు కార్యాలయంలో సూచించినట్లు రైతులు తెలిపారు. 3వ విడత మార్చి 14న గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం పొగాకు బోర్డులో పొగాకు కొనుగోళ్ల ప్రారంభానికి సంబంధించి అనుమతి లభించిందన్నారు. మొదటి విడత ఫిబ్రవరి 29న, ఒంగోలు కొండెపి, రెండో విడత మార్చి 6న కందుకూరు, 1, 2 వేలం కేంద్రాల్లో వెల్లపల్లిలో కొనుగోళ్లు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో రాజమండ్రి రీజనల్ మేనేజర్ ఆదిశేషయ్య, వేలం నిర్వహణాధికారి ఏడీ శ్యామ్, పొగాకు బోర్డు రైతు సంఘం నాయకులు పిన్నమనేని మధుమోహన్, పొగాకు బోర్డు మాజీ వైస్ చైర్మన్ గద్దె శేషగిరిరావు, ఇల్లూరి రామ్‌తో పాటు 5 పొగాకుబోర్డు రైతులు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## నేడు అన్నవరం దేవస్థానంలో సరస్వతి పూజ

అన్నవరం, ఫిబ్రవరి 21: త్వరలో జరిగే పదో తరగతి, ఇంటర్ తదితర పబ్లిక్ పరీక్షలలో విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలనే ఉద్దేశంతో అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో సరస్వతి పూజ నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. గురువారం ఉదయం 8.30కి విద్యార్థులందరూ రత్నగిరికి చేరుకోవాలని 9 గంటలకు సరస్వతి పూజ నిత్య కల్యాణ మండపంలో ప్రారంభమవుతుందని చెప్పారు. అలాగే నూతన రథంతో 10 గంటలకు ప్రాకార సేవ జరుగుతుందని అధికారులు వెల్లడించారు.

## హైవోల్టేజీ వైరు పట్టుకుని వ్యక్తి ఆత్మహత్య



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): హైవోల్టేజీ కరెంటు వైరు పట్టుకుని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని జీఆర్పీ సీఐ విజయ్ శంకర్ తెలిపారు. రాజమండ్రి రైల్వే స్టేషన్ రెండో ప్లాట్‌ఫాంలో ఆగి ఉన్న గూడ్స్ రైలు ఎక్కి కరెంటు వైరు పట్టుకున్నాడని, దీంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడన్నారు. కుడి చేయిపై బిందు, అమ్మ, ఓం అని పచ్చబొట్టు ఉందని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆ వ్యక్తి వివరాలు తెలిసిన వారు ఫోన్ నం.08832442821, 9491444022కి సమాచారం అందించాలని సీఐ కోరారు.

## రైలు నుంచి జారిపడి బిహార్ వాసి మృతి



తుని రూరల్, ఫిబ్రవరి 21: తుని రైల్వేస్టేషన్ పరిధిలో రావికంపాడు, అన్నవరం మధ్యలో పాట్నా వెళ్లే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నుంచి వ్యక్తి జారి పడి బిహార్‌కు చెందిన గణేష్ మండల్ మృతి చెందాడు. ప్రయాణికులు అప్రమత్తమై ట్రైన్ చైన్ లాగి కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. ఎస్ఐ షేక్ మారుఫ్ కేసు నమోదు చేశారు. గణేష్ మండల్ (50) బిహార్‌కు చెందిన వ్యక్తిగా తెలిపారు. మృతుడికి భార్య పిల్లలు ఉన్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

### అన్నప్రసాద భవన నిర్మాణానికి రూ.51వేలు విరాళం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 21: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళ మాత అన్నప్రసాద భవన నిర్మాణానికి కపిలేశ్వరపురానికి చెందిన సలాది శ్రీనివాస్-లక్ష్మి దంపతులు రూ.51వేలు విరాళం సమర్పించారు. వారికి ఆలయ ఛైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు స్వామివారి చిత్రపటం అందజేశారు. బుధవారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,10,876 లభించినట్టు ఈవో కిషోర్‌కుమార్ తెలిపారు.

## ఎమ్మెల్యే ద్వారంపూడి అగ్నికుల క్షత్రియులకు క్షమాపణ చెప్పాలి



నిరసన తెలుపుతున్న అగ్నికుల క్షత్రియ సంఘ నాయకులు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 21: కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కోనసీమ అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో బుధవారం అమలాపురం గడియార స్తంభం సెంటర్లో నిరసన ప్రదర్శన నిర్వహించారు.ద్వారంపూడి ఫ్లెక్సీలు చేతబూని మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట ధర్నా చేపట్టారు. అగ్నికుల క్షత్రియుల గురించి నీకేమీ తెలుసు, కబ్జాల ఎమ్మెల్యే డౌన్‌డౌన్, దేశాన్ని పాలించింది మా జాతి పల్లవులేనని మరిచిపోయావా అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అగ్నికులక్షత్రియులకు బహిరంగ క్షమాపణ చెప్పకుంటే మత్స్యకార గ్రామాల్లో తిరగనిచ్చేది లేదని సంఘ నాయకుడు, మాజీ జడ్పీటీసీ నాగిడి నాగేశ్వరరావు హెచ్చరించారు. ధర్నాలో సంఘ నాయకులు లంకే భీమరాజు, లంకే శ్రీను, శేరు శ్రీను, కోలా తాతరాజు, కర్రి స్వామినాథ్, కోలా రాంబాబు, అర్థాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## త్వరలోనే టీడీపీ-జనసేన పాలన: బండారు

ఆలమూరు, ఫిబ్రవరి 21: రాష్ట్రంలో అరాచక, అవినీతి పాలన సాగుతోందని... త్వరలోనే టీడీపీ-జనసేన అధ్వర్యంలో సురక్ష పాలన రానుందని మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. సూర్యారావుపేటలో బుధవారం జరిగిన 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ తిరిగి భవిష్యత్‌లో ప్రజల కోసం చేపట్టే పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. నిజాలురాస్తే తట్టుకోలేని స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వంఉందని...అందుకే ఈనాడు, ఆంధ్రజ్యోతిలపై దాడులు చేయిస్తోందన్నారు. టీడీపీ నాయకులు కాలా సాయిబాబు, దండంగి మమత, కె.సునీల్‌కుమార్ పాల్గొన్నారు.



సూర్యారావుపేటలో జరిగిన బాబు ష్యూరిటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

## జనసేనలో పలువురు చేరిక



రాజోలు, ఫిబ్రవరి 21: సోంపల్లిలో జనసేన నాయకుడు బొంతు రాజేశ్వరరావు ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన పలువురు బుధవారం జనసేన పార్టీలోకి చేరారు. పార్టీలో చేరిన కార్యకర్తలకు బొంతు రాజేశ్వరరావు, టీడీపీ, జనసేన పార్టీల రాజోలు నియోజకవర్గ సమన్వయకర్త గుండుబోగుల పెదకాపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ విధానాలతో రాష్ట్రంలోని అధిక శాతం మంది విసుగు చెందారన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటుందని తీవ్రంగా విమర్శించారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌లు ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటారన్నారు. వైస్ ఎంపీపీ యింటిపల్లి ఆనందరాజు, పార్టీ రాజోలు, మామిడికుదురు మండలాల అధ్యక్షులు సూరిశెట్టి శ్రీనివాసరావు, జాలెం శ్రీనివాసరావు, మంగిన నాగభూషణం, ముప్పర్తి సాయిబాబు, సర్పంచ్ కాకర శ్రీనివాసరావు, సోంపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు మొల్లేటి నాగరాజు, అడబాల సిరి, గుడాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### నారాయణలో విద్యార్థులకు పోటీలు

రామచంద్రపురం, ఫిబ్రవరి 21: స్థానిక నారాయణ ఇ.టెక్నో పాఠశాలలో బుధవారం ప్రిన్సిపాల్ వి.సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో ఏజీఎం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన విద్యార్థులకు క్విజ్, స్పెల్‌బెల్ పోటీలు నిర్వహించారు. రావులపాలెం, రాజోలు, అమలాపురం, యానాం నారాయణ పాఠశాలల విద్యార్థులుపోటీల్లో పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా ఆర్డీవో సుధాసాగర్ పాల్గొన్నారు.

### శెట్టిబలిజ యువజన సంఘం సాయం

మామిడికుదురు, ఫిబ్రవరి 21: పాశర్లపూడికి చెందిన మామిడిశెట్టి భారతి కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. రాజోలు తాలూకా శెట్టిబలిజ యువజన సంక్షేమ సంఘం రూ.50వేలు బుధవారం అందించింది. చెల్లుబోయిన శ్రీనివాస్, చెల్లుబోయిన రాంబాబు, పితాని సురేంద్ర, వాసంశెట్టి రామకృష్ణ, పాటి గోవిందు, కాండ్రేగుల నాగబాబు, మామిడిశెట్టి ప్రసాద్, కాండ్రేగుల శ్రీను, కోళ్ల తరుణ్ పాల్గొన్నారు.

### ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

కె.గంగవరం, ఫిబ్రవరి21: యండగండిలో పని చేస్తున్న ఎంజీఎన్ఆర్‌జీఎస్ ఫీల్డ్‌అసిస్టెంట్ కొప్పిశెట్టి మల్లేశ్వరరావు(43) బుధవారం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపారు. అతడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృత దేహానికి సర్పంచ్ చోడే గోవిందరాజు, పెంకే వెంకట రామకృష్ణ, ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది నివాళులర్పించారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మామిడికుదురు, ఫిబ్రవరి 21: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చెట్ల తొలగింపు కోసం గురువారం ఉదయం 10నుంచి సాయంత్రం 4గంటల వరకు పాశర్లపూడిబాడవ, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాలకు సరఫరా ఉండదని ఏఈ రవికుమార్ తెలిపారు.

### వలంటీర్లకు అవార్డులు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 21: ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంలో వలంటీర్లు వారధులని ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక మహిపాల చెరువు గ్రాండ్ పార్కులో బుధవారం ముమ్మిడివరం ఎంపీపీ కోలా గంగాభవానీ, కాట్రేనికోన మండల అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తుల అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో వలంటీర్లకు అవార్డులు అందించి సత్కరించారు. వైసీపీ రాష్ట్ర నాయకుడు పెన్మెత్స చిట్టిరాజు, నగర పంచాయతీ ఛైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, హితకారిణి సమాజ్ ఛైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, జడ్పీటీసీ కుడుపూడి శంకరరావు, నేల కిశోర్, కోలా బాబ్జి, నాయకులు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

**అంతర్వేది:** ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వీరా మల్లిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వలంటీర్లకు సేవారత్న, సేవామిత్ర అవార్డులను ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పాల్గొన్నారు. ఎంపీడీవో బడుగు మంగాదేవి, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్‌లు గొల్లమందల చిట్టిబాబు, ఓగూరి రత్నకుమారి, నాయకులు పాల్గొన్నారు.

### ఘనంగా సహాసిని నోము

అంబాజీపేట, ఫిబ్రవరి21: మహిళలు శాంతి సౌభాగ్యం కోసం సుహాసిని నోము ఆచరిస్తారని ప్రముఖ వేద పండితులు మండా లక్ష్మీనరసింహమూర్తి అన్నారు. గంగలకుర్రు అగ్రహారం గ్రామంలో గ్రంధి బాలాజీరావు-విశాలక్ష్మీ దంపతులు సుహాసిని నోమును బుధవారం ఆచరించారు. లలితా సహస్ర నామాలతో ముత్తైదువులకు, చిన్నారులకు పాదపూజ నిర్వహిం చారు. ప్రత్యేక పూజలు అనంతరం 135మంది మహిలకు పసుపుకుంకుమ, గాజులు, చీర, ఇతర వస్తువులను అందిం చారు. గ్రంధి మాణిక్యాలరావునీరజ, కడించర్ల శ్రీనివాసరావు అన్నపూర్ణ, గ్రంధి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనివాసరెడ్డిపై హత్యాయత్నం దారుణం

- తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ
- వైసీపీ అరాచక పాలనకు దాడులే నిదర్శనం
- రాష్ట్రంలో పెరుగుతున్న రౌడీమూకల అరాచకాలు

రావులపాలెం, ఫిబ్రవరి 21: తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిపై దుండగులు హత్యాయత్నం చేయడం దారుణమని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ అన్నారు. రావులపాలెంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రౌడీమూకల అరాచకాలు పెరుగుతున్నాయన్నారు. మొన్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై, ఈనాడు కార్యాలయంపై దాడి, నేడు శ్రీనివాసరెడ్డిపై హత్యాయత్నం చూస్తుంటే... రాష్ట్రంలో ఎవరిపై ఎప్పుడు దాడి చేస్తారోనని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారన్నారు. వైసీపీ అరాచక పాలనకు ఈ దాడులే నిదర్శమన్నారు.





రావులపాలెం: మాట్లాడుతున్న తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, రామచంద్రపురం: ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకుడు

### విలేకరులపై దాడులు అమానుష చర్య

రామచంద్రపురం, ఫిబ్రవరి 21: విలేకరులపై దాడులు చేయిస్తూ పత్రికా స్వేచ్ఛను హరిస్తున్న వైసీపీ అల్లరి మూకలపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల రాప్తాడులో జరిగిన సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్‌పై అమానుషంగా దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కోట శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆర్.డి.ఖాన్ తెలిపారు. అనంతరం ఆర్డీవో ఎస్.సుధాసాగర్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మీడియాపై దాడులు అప్రజాస్వామికం

అంబాజీపేట, ఫిబ్రవరి 21: నిజాలను నిర్భయంగా రాస్తున్న అనంతపురంలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణ, కర్నూలులో ఈనాడు దినపత్రిక కార్యాలయంలో వైసీపీ శ్రేణులు దాడులు చేయడం దారుణమని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వంలో పత్రికా విలేకర్లకు, ప్రజలకు రక్షణలేకుండా పోయిందని ఏపీసీసీ జనరల్ సెక్రటరీలు మహ్మద్ ఆరీఫ్, మాచవరపు శివన్నారాయణ అన్నారు. తహసీల్దారు జె.విమలకుమారికి వినతిపత్రాన్ని అందిం చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నెల్లి వెంకటరమణ, ఒంటెద్దు బాబి, ఆదుర్తి నారాయణమూర్తి పాల్గొన్నారు.

### పాత్రికేయులపై వైసీపీ దాడులు అమానుషం

మండపేట, ఫిబ్రవరి 21: పాత్రికేయులపై వైసీపీ ప్రభుత్వంలో దాడులు పెరిగిపోయాయని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆవేదన వ్యక్తంచేశారు. అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన వైసీపీ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ కృష్ణపై వైసీపీ దుండగులు చేసినదాడి మరువక ముందే కర్నూలులో ఈనాడు ప్రాంతీయ కార్యాలయంపై మంగళవారం వైసీపీ ఎమ్మెల్యే అనుచరులు దాడి చేయటం అమానుషమైన చర్య అని వేగుళ్ల అన్నారు. టీవీ5 విలేకరిపై దాడిని వేగుళ్ల ఖండించారు. వాస్తవాలు రాస్తున్న మీడియాపై దాడులు, ప్రశ్నించేవారిపై అక్రమ కేసులు పెడుతున్న వైసీపీప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు.

### రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతోంది

తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి మమత



ఆలమూరు, ఫిబ్రవరి 21: అంబేద్కర్ ప్రసాదించిన రాజ్యాంగం ఏపీలో అమలు కావట్లేదని... అరాచకం, అవినీతి రాజ్యమేలుతోందని తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి దండంగి మమత అన్నారు. బుధవారం ఆమె ఆలమూరులో విలేకరులతో మాట్లాడారు. రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై, కర్నూలులోఈనాడు కార్యాలయంపై వైసీపీ శ్రేణుల దాడిని ఖండించారు. నిజాలను నిర్భయంగా వెల్లడిస్తున్నందుకే సీఎం దాడులు చేయిస్తున్నారన్నారు. పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించడం సరికాదన్నారు.

# నాడీ వ్యవస్థను చైతన్యంచేసే తెలుగు వర్ణమాల





ఉప్పలగుప్తం: కవి నరసింహమూర్తిని సన్మానిస్తున్న ఏపీఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ అడపా గోపి తదితరులు, అమలాపురం: విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన ఎంపీపీ భాగ్యలక్ష్మి

- మాతృభాషా సదస్సులో కవి నరసింహమూర్తి
- ఘనంగా మాతృభాషా దినోత్సవం

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 21: మానవ నాడీ మండల వ్యవస్థకు చైతన్యాన్నిచ్చే శక్తి ప్రపంచంలో ఒక్క తెలుగు వర్ణమాలకు మాత్రమే ఉందని తెలుగు భాష బోధకుడు, కవి నల్లా నరసింహమూర్తి అన్నారు. భట్లుపాలెం ఏపీఎస్ఎన్ జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన అంతర్జాతీయ మాతృభాషా సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 'తెలుగు భాష పరిరక్షణ-మనుగడ' అంశంపై ప్రసంగిస్తూ అమ్మ భాషను పరిరక్షించుకోవలసిన బాధ్యత తెలుగువారిపై ఉందన్నారు. నల్లా రచించిన నడక నానీలు 102వ పుస్తకాన్ని ప్రిన్సిపాల్ అడపా గోపాలకృష్ణ ఆవిష్కరించారు. మాతృ భాషపై మమకారం పెంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. తెలుగు అధ్యాపకుల సంఘం తెలుగు రాష్ట్రాల గౌరవ ఉపాధ్యక్షునిగా ఎన్నికైన నరసింహమూర్తిని సత్కరించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మధుర కృపానందం, అమృత ఇంగ్లిష మీడియం పాఠశాల హెచ్‌ఎం నల్లా సరస్వతీదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

**అమలాపురం రూరల్:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి అధ్యక్షతన బుధవారం మాతృ భాషా దినోత్సవం నిర్వహించారు. ఎంఈవోలు గుబ్బల సూర్యప్రకాశరావు, సరెళ్ల దుర్గాదేవి మాతృభాష విశిష్టతను వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జొన్నాడ వెంకటేశ్వరరావు, కుడుపూడి బాబు, హెచ్‌ఎం విత్తనాల శ్రీనివాసరావు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ సరిదే సత్యపల్లంరాజు, న్యాయనిర్ణేతలు జి.పెద్దిరాజు, సీహెచ్ జయశ్రీ, ఎం.బాలాజీ, వి.రామారావు, సీహెచ్ వీఎస్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

**ముమ్మిడివరం:** మాతృభాష పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కళాసాహితీ ప్రధాన కార్యదర్శి పీవీఎస్ వర్మ పేర్కొన్నారు. ముమ్మిడివరం కళాసాహితీ, లలిత కళల సేవా వేదికల ఆధ్వర్యంలో రవీంద్ర విద్యా సంస్థల్లో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు తెలుగుభాష పరిరక్షణ, మాతృభాషగా తెలుగు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పొత్తూరి లక్ష్మీశ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడారు. విద్యార్థినీ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో విత్తనాల వరప్రసాదరావు, కేఎస్ఎన్ ప్రసాద్, పి.విజయ్‌కుమార్, ఎన్.అబ్బులు, వై.బాలరాజు పాల్గొన్నారు.

**మామిడికుదురు:** మామిడికుదురు దీప్తి స్కూలులో మాతృభాషా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. విద్యార్థులు తెలుగుతల్లి వేషధారణలో ఆకట్టుకున్నారు. ప్రతీ ఒక్కరూ మాతృభాషను మరువకూడదని, మాతృభాషా ఔన్నత్యాన్ని కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ వివరించారు. ప్రిన్సిపాల్ వై.నాగన్నబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

**పి.గన్నవరం:** పోతవరం మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం కత్తుల ఆనందరావు ఆధ్వ ర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.మాతృభాష విశిష్టతపై వ్యాసరచన, పొడుపు కథలు, నీతిపద్యాలు సామెతలు తదితర అంశాలపై విద్యా ర్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అం దించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.మల్లికార్జున్, మహ్మద్ ఇస్మాయిల్, గిడ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా రాజరాజేశ్వరస్వామి కల్యాణం

యానాం, ఫిబ్రవరి 21: యానాం శివాలయంలో వెలిసియున్న రాజరాజేశ్వరీ సమేత రాజరాజేశ్వర స్వామి కల్యాణం నిర్వహించారు. ముందుగా ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవదారులుగా ఉన్న రాజా మన్యం కనకయ్య జమిందార్ కుమారుడు ఫణికుమార్ దంపతులతో కల్యాణం నిర్వహించారు. పుదుచ్చేరి ప్రభుత్వం తరుపున యానాం పరిపాలనాధికారి మునిస్వామి, ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సతీమణి ఉదలయలక్ష్మీ వారికి సువర్ణ యజ్ఞోపవీతం, ముత్యాల తలంబ్రాలు, సువర్ణమంగళసుత్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు మానేపల్లి శివయ్య నేతృత్వంలో శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ఈవో ఖండవల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

### వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం

కె.గంగవరం, ఫిబ్రవరి 21: గంగవరం వేంచేసియున్న వేణుగోపాలస్వామి వారి ఆలయంలో మంగళవారం రాత్రి రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేదపండితుడు బిక్క వోలు కేశవాచార్యులు ఆధ్వర్యంలో పండితులు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. దేవస్థానం ఛైర్మన్ అనసూరి ప్రసాద్, గ్రామ సర్పంచ్ కొటి లక్ష్మీనరసమ్మ వెంకట్రావు, సొసైటీ ఛైర్మన్ ఈదల రమేష్, ఆలయ ఈవో ఎం.వి.వి.సత్యనారాయణ, అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి కల్యాణం తిలకించారు. కోలాట ప్రదర్శన చేశారు.

### నేత్రదానం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 21: పేరవరానికి చెందిన ముత్తా పద్మారావు(84) బుధవారం మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల సమచారంతో రాజమహేంద్రవరం రాధాకృష్ణ ఐ బ్యాంకు నిపుణులు వచ్చి పద్మారావు నేత్రాలను సేకరించారు.

### ఫొటోగ్రాఫర్ కృష్ణపై దాడి అమానుషం

రాజోలు: అనంతపురం జిల్లా రాప్తాడులో నిర్వహించిన సిద్ధం బహిరంగ సభలో ఆంధ్యజ్యోతి ఫొటోగ్రఫర్ కృష్ణపై వైసీపీ కార్యకర్తలు దాడి చేయడం అమానుషమని టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ల వెంకటరమణ అన్నారు. ఇంటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు.

### పోస్టల్ సేవింగ్స్ మెగా మేళా

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 21: అమలాపురం లయన్స్ క్లబ్ హాలులో బుధవారం పోస్టల్ సేవింగ్స్ మెగా మేళా నిర్వహించారు. రాష్ట్ర అసిస్టెంట్ డైరెక్టర్ జి.శివనాగరాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అమలాపురం పోస్టల్ సూపరింటెండెంట్ చెరుకూరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన మేళాలో పోస్టాఫీసు సేవింగ్స్ బ్యాంకు, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, ఇండియా పోస్టుపేమెంట్ బ్యాంకు విషయాలను శివనాగరాజుతో పాటు ఐపీపీబీ సీనియర్ మేనేజరు కె.రాజ్‌కుమార్, సబ్‌డివిజన్ ఇన్‌స్పెక్టర్ వీఎస్ఎంవీ వంశీకృష్ణ, కె.అమర్‌నాథ్ వివరించారు. సేవింగ్స్ బ్యాంకు ఖాతాలు అత్యధికంగా తెరిచిన వారితో పాటు ఇన్సూరెన్సు ప్రీమియం ఎక్కువగా సేకరించిన వారిని శివనాగరాజు సత్కరించి బహుమతులు అందజేశారు. ఒక్కరోజులోనే రూ.34.50 లక్షల ఇన్సూరెన్సు ప్రీమియం సేకరించినట్టు సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు.

### అభివృద్ధి పనుల ప్రారంభం

రాయవరం, ఫిబ్రవరి 21: నదురుబాదలో వైఎస్ఆర్ విలేజ్ క్లీనిక్, గ్రామ సచివాలయాలను బుధవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రారంభించారు. తొలుత గ్రామంలో ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా అమ్మవార్ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, సర్పంచ్ చింతపల్లి శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, జడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

### పైపులైను పనుల ప్రారంభం

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 21: గున్నేపల్లి అగ్రహారంలో రూ.21.70లక్షలతో వాటర్ ట్యాంకు మంజూరు కాగా రూ.7లక్షలతో పైపులైను పనులను సర్పంచ్ పెద్దిరెడ్డి రాము బుధవారం ప్రారంభించారు. యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పెద్దిరెడ్డి శ్రీరామమూర్తి, కుడుపూడి నాగరాజు, పెద్దిరెడ్డి రామకృష్ణ, విత్తనాల ప్రసాద్, కొడమంచిలి శ్రీను, కేతా శ్రీను పాల్గొన్నారు.

### బెండా కాలువ వంతెనపై రెయిలింగ్ పునరుద్ధరణ

అల్లవరం, ఫిబ్రవరి 21: బోడసకుర్రు పంచాయతీ పరిధిలో పల్లిపాలెం వైనతేయ రేవుకు వెళ్లే దారిలో బెండా కాలువపై వంతెన ఇనుప రెయిలింగ్ కూలిపోగా సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి రైల్వే అధికారులతో మాట్లాడి ఇనుప రాడ్లు రప్పించారు. దానిని పునరుద్ధరించారు. దీంతో మంచినీటి పైపులైన్లను కూడా సరిచేశారు. ఓలేటి పరమేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్.దుర్గా శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

### సినిమా గైడ్

**అమలాపురం**

| | |
|---|---|
| వెంకటరామ | : అంబాజీపేట మ్యారేజీ బ్యాండు |
| వెంకటరమణ | : ఈగల్ |
| శ్రీలలిత | : రాజధాని ఫైల్స్ |
| శేఖర్ స్క్రీన్-1 | : హనుమాన్ |
| శేఖర్ స్క్రీన్-2 | : ఐ హేట్ లవ్ |
| రమా | : గుంటూరు కారం |
| గణపతి | : హాయ్ నాన్న |
| వెంకటపద్మావతిస్క్రీన్-1 | :ఊరుపేరుభైరవకోన |
| వెంకటపద్మావతి స్క్రీన్-2 | : యాత్ర-2 |

### నానో ఎరువులపై అవగాహన

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 21: ఇఫ్కో నానో ఎరువులను పిచికారీ చేయడం వల్ల పంటలకు ఎన్నో లాభాలు చేకూరతాయని మండల వ్యవసాయాధికారి కడలి ధర్మప్రసాద్ పేర్కొన్నారు. రంగాపురం వ్యవసాయ సహకార సంఘ అధ్యక్షుడు మామిళ్లపల్లి రాజారావు ఆధ్వర్యంలో బుధవారం రైతు సదస్సు నిర్వహించారు. రైతులు నానో ఎరువులను వినియోగించడం వల్ల ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. ఇఫ్కో ఉమ్మడి జిల్లా అధికారి గుంటకశ్యామ్‌ప్రసాద్‌బాబు నానో యూరియా, నానో డీఏపీలు పనిచేసే విధానాన్ని రైతులకు సోదాహరణంగా వివరించారు. సహకార సంఘ సీఈవో యెరుబండి శివ, సురేంద్ర, వరుణ్, పలువురు రైతులు పాల్గొన్నారు.

### పాలూరి మృతికి సంతాపం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 21: బీజేపీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి పాలూరి శ్రీనివాసరావు అకాల మృతికి చింతిస్తూ బీజేవైఎం జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం అమలాపురంలోని పార్టీ కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. జిల్లా శాఖ అధ్యక్షుడు కొండేటి ఈశ్వర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసరావు పార్టీకి చేసిన సేవలను పలువురు వక్తలు వివరించారు. పాలూరి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. నాయకులు వెంపరాల భాస్కరశాస్త్రి, చిట్టూరి రాజేశ్వరి, సునీత, ఆదిలక్ష్మి, బొంతు శివాజీ, జగతా శాంతి, బచ్చు ప్రభాకర్, కర్రి తాతారావు, నేతల చంటిపాల్గొన్నారు.

### శ్రీనివాసరావు మృతి బీజేపీకి తీరని లోటు

మామిడికుదురు, ఫిబ్రవరి 21: బీజేపీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి పాలూరి శ్రీనివాసరావు మృతి పార్టీకి తీరని లోటని పలువురు వక్తలు పేర్కొన్నారు. మామిడికుదురుకు చెందిన శ్రీనివాసరావు బుధవారం అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతిచెందారు. ఆయన చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు మెండా ఆదినారాయణ, గాడి సత్తిబాబు, కోటిపల్లి సాయిబాబు, మెండా కొండయ్య, శ్రీను పాల్గొన్నారు.

### అగ్ని ప్రమాద బాధితులకు టీడీపీ నాయకుల సాయం

అంబాజీపేట, ఫిబ్రవరి 21: పుల్లేటికుర్రు పరిధిలోని వ్యాఘ్రేశ్వరానికి చెందిన గుబ్బల వెంకటరమణ, గుబ్బల రామకృష్ణకు చెందిన తాటాకిల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నికి ఆహుతైంది. టీడీపీ నాయకులు మందపాటి కిరణ్‌కుమార్- అనితాశుభజ్యోతి దంపతులు ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దాసరి వీరవెంకటసత్యనారాయణ, ఎంపీటీసీ పబ్బినీడి రాంబాబు, గోడా సత్యనారాయణ, దొమ్మేటి సురేష్‌లు పాల్గొన్నారు. అలాగే శ్రీవ్యాఘ్రేశ్వర ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో రూ.6,300 బాధిత కుటుంబానికి అందించారు.

### లక్కవరం శిశు మందిర్‌కు బస్సు బహూకరణ

మలికిపురం, ఫిబ్రవరి 21: లక్కవరం సరస్వతి శిశు మందిర్‌కు నాగార్జునా కనస్ట్రక్షన్స్ హైదరాబాద్ వారు విద్యార్థులకు బస్సు సౌకర్యం కోసం రూ.10లక్షల విరాళం అందజేశారు. ఈవిరాళంతో కొనుగోలుచేసిన బస్సును ఎన్‌సీసీ(ప్రాజెక్టు) డైరెక్టర్ రుద్రరాజు సుబ్బరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని బస్సును ప్రారంభించారు. సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ విద్యను అందిస్తున్న సరస్వతి శిశుమందిర్‌ను రుద్రరాజు అభినందించారు. కార్యక్రమంలో మంగెన నరసింహారావు, ఆర్పీపీ రాజు, బోనం రాజు తదితరులు పాల్గొన్నారు.

### తువ్వమట్టి తరలిస్తున్న లారీల స్వాధీనం

పి.గన్నవరం, ఫిబ్రవరి 21: అనుమతులు లేకుండా తువ్వమట్టిని తరస్తున్న రెండు లారీలను ఎస్ఈబీ పోలీసులు నాగుల్లంక శివారు పెదకందాల పాలెంలో స్వాధీనం చేసుకుని, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు పి.గన్నవరం ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు. తూతూ మంత్రంగా రెండు లారీలను అదుపులోకి తీసుకుని మమా... అనిపిస్తారని పలువురు బహిరంగ విమర్శలు చేస్తున్నారు.

### వాసవి నిత్యాన్నదాన భవన నిర్మాణానికి శంకుస్థాపన

ఆత్రేయపురం, ఫిబ్రవరి 21: వాడపల్లిలో శ్రీవేంకటేశ్వర వాసవి నిత్యాన్నదాన ట్రస్టు భవన నిర్మాణానికి ఏపీఐఐసీ మాజీ ఛైర్మన్ శ్రీఘాకోళపు శివరామసుబ్రహ్మణ్యం దంపతులు బుధవారం శంకుస్థాపన చేశారు. గణపతి, చండీ, సుదర్శన హోమాలను జరిపారు. ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, ట్రస్టు ప్రతినిధులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

### టీడీపీ నాయకుల పరామర్శ

ముమ్మిడివరం, ఫిబ్రవరి 21: పలు కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు బుధవారం పరామర్శించారు. అన్నంపల్లిలో ఇటీవల ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న బళ్ల చిన్నీని మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పరామర్శించారు. కొత్తలంకలో అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న దాపకి నాగేశ్వరరావును, కోర్ల అనంతవరలక్ష్మి ఇటీవల మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను, ముమ్మిడివరంలో నక్కా సర్వేశ్వరరావు మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను బుచ్చిబాబు పరామర్శించారు. వారి వెంట అర్థాని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణకుమార్, చెల్లి అశోక్, ములపర్తి బాలకృష్ణ, తోలేటి రాంబాబు తదితరులు ఉన్నారు.

### బీజేపీ పోరుయాత్ర

మండపేట, ఫిబ్రవరి 21: ఏడిద, వై.సీతానగరం గ్రామాల్లో బుధవారం బీజేపీ శ్రేణులు పోరుయాత్ర నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ నేతృత్వంలో గ్రామాల్లో నాయకులు పర్యటించారు. కేంద్రంలో బీజేపీ అమలు చేస్తున్న పథకాలు వివరించారు. రాష్ట్రంలో ఒక్కసారి, కేంద్రంలో మరోసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు.

### ముత్యాలమ్మను దర్శించుకున్న వేగుళ్ల, నల్లమిల్లి

రాయవరం, ఫిబ్రవరి 21: నదురుబాద గ్రామస్థుల ఇలవేల్పు శ్రీముత్యాలమ్మ అమ్మవారి ఆలయాన్ని పునఃనిర్మించడంతో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. బుధవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దర్శించుకున్నారు. వారిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఉండవిల్లి సుబ్బారాయుడు, పోతుల గంగాధరప్రసాద్, ఉప్పలపాటి చంద్రరావు, వుల్ల శ్రీనివాసరావు, చల్లా అప్పారావు, గుత్తుల గోపాలకృష్ణ, శోభన్‌బాబు, బడుగు విక్టర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### మెగా రక్తదాన శిబిరం

మలికిపురం, ఫిబ్రవరి 21: జనసేన రాజోలు నియోజకవర్గ నాయకుడు డాక్టర్ రాపాక రమేష్‌బాబు పుట్టినరోజు సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త గుండుబోగుల పెద్దకాపు ప్రారంభించారు. డాక్టర్ రమేష్‌బాబు అభిమానులు 50 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు లింగోలు పెద్దబ్బులు, తాడి మోహన్, గుండాబత్తుల తాతాజీ, పినిశెట్టి బుజ్జి, గుబ్బల ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### జనసేన బూత్‌కమిటీలకు కన్వీనర్ల ఎంపిక

పి.గన్నవరం, ఫిబ్రవరి 21: జనసేన పార్టీ పి.గన్నవరం నియోజకవర్గ బూత్ కమిటీలకు కన్వీనర్లను ఎంపిక చేశారు. పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి, మామిడికుదురు మండలాల కన్వీనర్లుగా యల్లమిల్లి చిట్టిబాబు, కోర్లపాటి వెంకటేశ్వరరావు, పుల్లంశెట్టి అరుణ్‌కుమార్, తుండూరి శ్రీనివాస్‌లను ఎంపిక చేసినట్లు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ గిడ్డి సత్యనారాయణ తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన వారిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో జనసేన ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వ రరావు, కార్యదర్శి వాసంశెట్టి కుమార్, మండల అధ్యక్షుడు సాధనాల శ్రీవెంక టసత్యనారాయణ, జాలెం శ్రీనివాసరాజా, దొమ్మేటి సాయికృష్ణ, పొలిశెట్టి రాజేష్, తాటికాయల వెంకటేష్ పాల్గొన్నారు.

### వలంటీర్లకు పురస్కారాలు

మామిడికుదురు, ఫిబ్రవరి 21: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కె.వనజాకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సేవా వజ్ర, సేవామిత్ర, సేవారత్న అవార్డులను వలంటీర్లకు బుధవారం ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు బుధవారం అందజేశారు. పార్టీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

### విశాఖ ఎంపీ యాదవులకు క్షమాపణ చెప్పాలి

మండపేట, ఫిబ్రవరి 21: చెన్నుబోయినవంశీకృష్ణ యాదవ్‌ను కులం పేరుతో దూషించిన విశాఖ ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ యాదవ జాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలని యాదవ సేన జాతీయ అధ్యక్షుడు కోన సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఎంపీ నోరు అదుపులో ఉంచుకోకుండా వంశీకృష్ణపై వ్యవహరించిన తీరు, వాడిన భాషా అభ్యంతరకరంగా ఉంద న్నారు. ఎంపీ క్షమాపణ చెప్పకుంటే యాదవ సంఘం తరపున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

### 23లోపు ఈకేవైసీ చేయించుకోవాలి

రాయవరం, ఫిబ్రవరి 21: లొల్ల, చెల్లూరు, కూర్మాపురం గ్రామాల్లో దాళ్వా పంటకు సంబంధించి పంట నమోదు, ఈకేవైసీని బుధవారం ఏవో కె.ప్రభాకర్ పరిశీలించారు. మండలంలో 14,466 ఎకరాల్లో పంట నమోదు పూర్తి చేశామని, ఇప్పటివరకు 12,220 ఎకరాలకు సంబంధించి ఈకేవైసీ పూర్తిచేసినట్లు చెప్పారు. ఈనెల23లోపు రైతులు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

### ఘనంగా గరిస ధాన్యం, లక్ష పసుపుకొమ్ముల నోము

మామిడికుదురు, ఫిబ్రవరి 21: లూటుకుర్రులోని గోకవరపు సూర్యకుమారి కల్యాణ మండపంలో ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ ఆకే వెంకటేశ్వరరావు-లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో గరిస ధాన్యం, లక్ష పసుపు కొమ్ముల నోము పూజ బుధవారం ఘనంగా నిర్వహించారు. పూజలో పాల్గొన్న భక్తులకు తులసి మొక్కలను పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. అనంతరం జరిగిన విందులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### విద్యాభివృద్ధికి కృషి

అంబాజీపేట, ఫిబ్రవరి 21: విద్యా రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో కెమిస్ట్రీ ల్యాబ్, అదనపు భవనానికి, వాలీబాల్ కోర్టు నిర్మాణానికి ఎమ్మెల్యే బుధవారం భూమి పూజ చేశారు. పీఎం స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా నిధులతో వీటిని నిర్మిస్తామన్నారు. జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, నాయకులు కోర్లపాటి కోటబాబు, నాగవరపు నాగరాజు, విత్తనాల శేఖర్, సుదాబత్తుల రాము, మట్టపర్తి హరి, కామిశెట్టి మధు, హెచ్‌ఎం కె.సాయిరామ్ పాల్గొన్నారు.

### ప్రజా పోరుయాత్రను విజయవంతం చేయాలి

రాజోలు, ఫిబ్రవరి 21: ఈనెల21 నుంచి 29వరకు చేపడుతున్న ప్రజా పోరుయాత్రను బీజేపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా పిలుపునిచ్చారు. రాజోలులో విజయదుర్గా గార్డెన్స్‌లో నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన రాజోలు నియోజకవర్గ బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్, బీజేపీ కార్యవర్గ సభ్యుడు అడబాల సత్యనారాయణ, యిందుకూరి అచ్యుతరామరాజు, పితాని శ్రీనివాసరావు, కె.కనకేశ్వరరావు, గొల్లమండల నిరంజనరావు, చెల్లింగి త్రినాథరావు, వడ్లమూడి ప్రకాష్ పాల్గొన్నారు.

### పోలీసుల అదుపులో పశువుల దొంగలు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 21: పశువులను దొంగిలించి విక్రయిస్తున్న తండ్రీ కొడుకులను బుధవారం ముమ్మిడివరం పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. కొత్తలంక గ్రామంలో పెద్దిరెడ్డి సత్తిబాబుకు చెందిన పుంగనూరు గిత్త దూడ మంగళవారం రాత్రి అపహరణకు గురికావడంతో అతను పోలీసులకు ఫిర్యాదు చేసి బంధువుల సాయంతో గాలింపు చర్యలు చేపట్టాడు. అన్నంపల్లి టోల్‌గేటు వద్దనున్న సీసీకెమెరా ఆధారంగా తాళ్లరేవు మండలానికి చెందిన సుంకరపాలెంలో కబేళా నిర్వాహకుని వద్ద ఆ గిత్తను వారు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి వెళ్లి విచారించగా మురమళ్లకు చెందిన తండ్రీ కొడుకులు గిత్తను విక్రయించినట్లు తేలింది. తండ్రీ కొడుకులను, ఆ గిత్తను కొనుగోలుచేసిన వ్యక్తిని, గిత్తను తరలించేందుకు ఉపయోగించిన వ్యాను డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులు ప్రశ్నిస్తున్నారు.